

ట్రాక్టర్‌తో భూమి చదును చేస్తున్న రైతు



ముళ్లపొదలను తొలగిస్తున్న రైతులు

# దుక్కులు సిద్ధం

## వానకాలం వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం

*భైంసా, మే 18 :* జూన్ మొదటివారంలో రుతుపవనాలు వస్తాయనే సమాచారంతో రైతన్నలు వానకాలం వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. సీజన్‌కు రెండు నెలల సమయం ఉండగానే.. సన్న, చిన్నకారు రైతులు నాగళ్లు, ట్రాక్టర్లతో పొలంబాట పడుతున్నారు. మహిళలు వారికి తోడుగా చెత్తా, చెదారాన్ని కాల్చుతున్నారు. దుక్కులు సిద్ధం చేస్తున్నారు. పత్తి, కంది, సోయా సాగు చేసే భూముల్లో పుల్ల కూడా లేకుండా చూస్తున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వేసవి దుక్కుల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. దీంతో రైతులు వేసవి దుక్కులు, వ్యవసాయ పనుల్లో బిజీగా గడుపుతున్నారు.

## పత్తి విత్తనాల కోసం బారులు



విత్తనాల షాపుల ఎదుట క్యూ కట్టిన రైతులు

ఎదులాపురం, మే 18 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విత్తన షాపుల ఎదుట రైతులు బారులుదీరుతున్నారు. పత్తి రైతులకు కావాల్సిన రాశి 659 రకం విత్తనాల కోసం శనివారం ఉదయం నుంచే సీడ్స్, ఫర్టిలైజర్ షాపుల ఎదుట అన్నదాతలు బారులుదీరారు. షాపులలో రాశి కంపెనీ విత్తనాలు బ్యాగులున్న వ్యాపారులు నోస్టాక్ బోర్డులు పెడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పట్టణంలోని పలు విత్తనాల షాపులను వ్యవసాయ అధికారులు తనిఖీలు చేసి స్టాక్‌ను నమోదు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే డిమాండ్ ఉన్న విత్తనాలు మార్కెట్‌లో అన్ని షాపుల్లో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ రాజర్షి షా ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. అయినప్పటికీ వ్యాపారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ముందస్తుగా సిద్ధంగా ఎందుకు ఉంచుకోవడం లేదని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆదిలాబాద్‌లోని కుమ్రం భీం చౌక్‌లో ఎండిపోయిన మొక్కలు

# పచ్చదనం కనుమరుగు

**కేసీఆర్ సర్కారు** పచ్చదనానికి చాలా ప్రాధాన్యత ఇచ్చింది. హరితహారంలో భాగంగా కోట్లాది మొక్కలు నాటించగా.. అవి మహావృక్షాలుగా మారాయి. పండ్లు, నీడను ఇస్తున్నాయి. ఎటు చూసినా పచ్చదనం కొట్టొచ్చినట్లు కనిపించేది. ఎండాకాలంలో రోజు నీటిని పోసి రక్షించేవారు. ప్రస్తుతం కేసీఆర్ చేసిన మంచి పనులను కనుమరుగు చేయాలని చూస్తున్నది. ఇందులో భాగంగానే పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. మొక్కలు వట్టిపోతున్నా.. కాంగ్రెస్ సర్కారు నీరు కూడా పోయనివ్వడం లేదు. కంటికి ఇంపుగా కనిపించే మొక్కలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఉదాహరణకు.. ఆదిలాబాద్ పట్టణంలోని కుమ్రం భీం చౌక్‌లో కేసీఆర్ హయాంలో నాటిన మొక్కలు నీరు లేక వట్టిపోయాయి. చూడడానికి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా మొక్కలు, గడ్డికి నీరు పోయాలని అధికారయంత్రాంగాన్ని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

\- ఎదులాపురం, మే 18



జొన్నల కొనుగోళ్ల వివరాలను సీఈవో కేశవ్‌ను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి, మే 18 : రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల తడిసిన వరి, జొన్నలను రాష్ట్ర ప్రభుత్వం కొనకుండా రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి నష్టపోయిన రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. రైతులను కాపాడుకునే బాధ్యత నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనపై ఉందని, ప్రభుత్వంతో కొట్లాడి అయినా రైతులకు న్యాయం చేస్తానని తెలిపారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా ఏ సమయంలో అయినా తనని సంప్రదించాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ప్రాథమిక సహకార సంఘం సీఈవో కేశవ్ సిబ్బందితో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ కన్వీనర్ కృష్ణ రత్నప్రకాశ్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, కౌడాల మహేందర్, రజినీకాంత్, రజినీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అభిరాంరెడ్డి, గంద్రత్ అశోక్, ముచ్చ రఘన్న, చంద్రయ్య, సిరిగిరి లక్ష్మీపతి నాగరెడ్డి, భరత్, అండె అశోక్, నర్సింగ్, రాంచందర్ రెడ్డి, ఉత్తం, నారాయణ పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..

- నిర్మల్ జిల్లాకు చేరిన 2,26,945 బుక్స్
- రెండు భాషల్లో పుస్తకాల ముద్రణ
- విద్యార్థులకు సులువుగా ఆంగ్ల బోధన



నిర్మల్‌లోని డిపోలో పాఠ్యపుస్తకాలను అందిస్తున్న నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, మే 18 : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 834 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 576 ప్రాథమిక, 90 ప్రాథమికోన్నత, 168 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితోపాటు కేజీబీవీలు, మైనార్టీ రెసిడెన్షియల్, మహాత్మ జ్యోతిబా పూలే, మోడల్, సొసైటీ పాఠశాలలు కూడా ఉన్నాయి. వీటిలో దాదాపు 80 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బడులు ప్రారంభంకాగానే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాగా.. యూడైస్‌లో వివరాల ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలు దశలవారీగా ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారా జిల్లాకు పంపిస్తున్నది. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాల్లో పుస్తకాలను ముద్రించారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 4,79,130 పుస్తకాలు అవసరం ఉండగా.. ఇందులో 2,26,945 రాగా.. ఇంకా 2,42,185 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. ఇవీ కూడా వారం రోజుల్లో రానున్నాయి. ఇప్పటికే గోదాములకు చేరుకోగా.. వీటిని త్వరలోనే పంపిణీ చేయనున్నారు.

### బార్ కోడింగ్ ఆధారంగా పంపిణీ

ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలు ప్రైవేటుపరం కాకుండా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలకు శ్రీకారం చుట్టింది. స్కాన్, బార్‌కోడింగ్ ఆధారంగా ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ముద్రించింది. పుస్తకాలపై ఉన్న బార్ కోడ్ ఆధారంగా అవి ఏ జిల్లాకు కేటాయించడం జరిగిందో సులువుగా తెలుసుకోవచ్చు. ప్రభుత్వ పుస్తకాలను ప్రైవేటు వ్యక్తులు విక్రయించినట్లయితే బార్ కోడ్ ఆధారంగా అవి ఏ జిల్లాకు కేటాయించారో సులువుగా తెలుసుకోవచ్చు. ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పక్కదారికి అడ్డుకట్ట పడింది. కేసీఆర్ ప్రభుత్వం తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో సగం, సగం సిలబస్‌ను ముద్రించింది. దీంతో రెండు విడుతల్లో పాఠ్య పుస్తకాలు పంపిణీ కానున్నాయి. రెండో విడుత అక్టోబర్‌లో రానున్నాయి. పాఠశాలలు తెరిచేలోగా పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.





వీసీలో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, హాజరైన కలెక్టర్ రాజర్షి షా



నిర్మల్ టౌన్ : హాజరైన కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అధికారులు

# గ్రూప్-1 ప్రిలిమినరీకి ఏర్పాట్లు చేయాలి

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఎదులాపురం, మే 18 : తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ద్వారా జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గూగుల్ మీట్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, నోడల్ అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని ఛాంబర్ ద్వారా ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడాలన్నారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 9 గంటల లోపే కేంద్రాలకు చేరుకోవాలని, 9.30 గంటలకు బయోమెట్రిక్ హాజరు మొదలవుతుందన్నారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిదాలు జరగకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాల్లో వసతులు కల్పించాలని, నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్‌ఫోన్‌లతోపాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు. కలెక్టర్లు పోలీసుశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలను ఆయా పోలీస్ హెడ్‌క్వార్టర్లలో బందోబస్తు మధ్య ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 18 కేంద్రాలు, రీజనల్ సెంటర్ 1 ఏర్పాటు చేశామని తెలిపారు. 6,729 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, ఇందుకు సంబంధించిన రూట్ ఆఫీసర్లు ఐదుగురు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్కాడ్ బృందాలు, సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలు స్ట్రాంగ్‌రూమ్, సెక్యూరిటీ పరీక్షా కేంద్రంలో అన్ని మౌలిక వసతుల ఏర్పాట్లు చేశామన్నారు. ఈ గూగుల్ మీట్ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఉన్నారు.

### నిర్మల్ జిల్లా..

నిర్మల్ టౌన్, మే 18 : టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నత అధికారులతో గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై వీసీ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో 4,608 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 6305646600ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో రీజినల్ కో-ఆర్డినేటర్ గంగారెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఏవో కలెక్టరేట్ సూర్యారావు పాల్గొన్నారు.

# ధాన్యం వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలి



సమీక్ష చేస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్ టౌన్, మే 18 : ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు, వివిధ అంశాలపై రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో మిల్లులకు తరలించాలని, కొనుగోలు వివరాలను కచ్చితంగా ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. మండలాలవారీగా ధాన్యం కొనుగోలు వివరాలు, రైతుల సంఖ్య, మిల్లులకు తరలించిన లారీల వివరాలు, ట్యాబ్‌లో ఎంట్రీ చేసిన సంఖ్య, పెండింగ్ ట్యాబ్ ఎంట్రీ వివరాలు, ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జామ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు డబ్బులు జమ చేసేందుకు అవసరమైన డాక్యుమెంట్లు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎం సివిల్ సప్లయ్ అధికారిణి శ్రీకళ, డీసీవో నర్సయ్య పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

# తొలి త్రిబుల్ తలాక్ కేసు

## మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్ వెల్లడి

ఎదులాపురం, మే 18 : ఆదిలాబాద్ జిల్లాలోనే తొలి త్రిబుల్ తలాక్ కేసు నమోదు చేసినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఠాణాలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని కేఆర్కే కాలనీకి చెందిన జాస్మిన్ (28) అదే కాలనీకి చెందిన అబ్దుల్ అతీక్‌తో 2017లో వివాహం అయింది. ఇద్దరు ఆడపిల్లలున్నారు. రెండేండ్లుగా మనస్పర్థల కారణంగా తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. గతేడాది ఫిబ్రవరిలో భర్త అబ్దుల్ అతిక్‌పై వేధింపుల కేసు నమోదైంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు శుక్రవారం భర్తపై త్రిపుల్ తలాక్ కేసు సెక్షన్ 4 ఆఫ్ ది ముస్లిం మహిళ(వివాహంపై హక్కుల రక్షణ) చట్టం 2019 ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

# భ్రూణహత్యల నివారణపై అవగాహన

ఎదులాపురం, మే 18 : భ్రూణహత్యల కట్టడికి విస్తృత ప్రచారం కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. తమ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పీసీపీఎండీటీ చట్టం 1994పై గ్రామాల్లో మహిళా సమాఖ్య సమావేశాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం లింగ నిష్పత్తిలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతున్నదని, ఎవరైనా అబార్షన్లు చేస్తున్నరా? ఆసుప్రతుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు ఏమైనా చేస్తున్నారా? అనే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులు ఉన్నారు.

# కేజీబీవీలో ఇంటర్ అడ్మిషన్లు షురూ

- చదువుతోపాటు ఉపాధి కోర్సుల నిర్వహణ
- నిర్మల్ జిల్లాలో 12కు చేరిన కళాశాలలు
- ప్రవేశాల కోసం విస్తృత అవగాహన
- 960 సీట్లు ఖాళీ.. ఇప్పటికే 560 అడ్మిషన్లు పూర్తి..
- జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం



నిర్మల్‌లో కార్పొరేట్ తరహాలో ఉన్న కేజీబీవీ కళాశాల

నిర్మల్ అర్బన్, మే 18 : నిర్మల్ జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో(కేజీబీవీ) ఇంటర్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. వీటిలో యేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. జిల్లాలో 19 మండలాల్లో 10 కేజీబీవీ కళాశాలు ఉన్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అధునాతన హంగులతో నూతన కళాశాల భవనాలను నిర్మించింది. నిర్మల్ జిల్లాలో నిర్మల్ అర్బన్, లక్ష్మణచాంద, మామడ, కడెం, జాం, నర్సాపూర్, దిలావర్‌పూర్, దస్తురాబాద్, ముథోల్ మండలాల్లో ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలలను దశలవారీగా కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇందులో ముథోల్, దస్తురాబాద్ మండలాల్లోని కేజీబీవీలు కళాశాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. గతంలో పది కేజీబీవీ కళాశాలలు ఉండగా.. గతేడాది ఖానాపూర్(మాస్కాపూర్) పెంబి(మందపల్లి) కేజీబీవీలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయడంతో వాటి సంఖ్య 12కి చేరింది.

### రెగ్యులర్ విద్యతోపాటు ఉపాధి కోర్సులు

విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా ఉండేందుకు ప్రభుత్వం విద్యార్థులకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెడుతూ ఉచిత విద్యను అందిస్తున్నది. విద్యార్థులకు సాధారణంగా సంప్రదాయ కోర్సులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులను అందుబాటులో ఉంచగా.. వీటితోపాటు ఉపాధి కోర్సులను ప్రవేశపెడుతూ విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడేలా చర్యలు చేపట్టింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులతోపాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులను ప్రవేశ పెట్టింది.జిల్లాలోని ముథోల్, మామడ, కడెం కళాశాలలు, ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉండగా విద్యార్థులు ఉపాధి కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి గ్రూపునకు మొదటి సంవత్సరం 40 మంది విద్యార్థుల చొప్పున రెండు కోర్సులకు కలిపి 80 సీట్లను భర్తీ చేయనుంది.

### కళాశాలల ప్రారంభానికి ముందే భర్తీ

కేజీబీవీ కళాశాల్లో కల్పిస్తున్న ఉచిత విద్య, వసతి, సదుపాయాలు, గతేడాది ఫలితాలను చూసి ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు మార్కులు సాధించడంతో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేటు కళాశాలల్లో నాణ్యమైన విద్య దొరకకా.. అనుభవజ్ఞులైన అధ్యాపకులు లేక ఫీజుల భారం భరించలేక కళాశాలల వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దీంతో కళాశాలలు ప్రారంభం కాకముందే ఇప్పటికే 560 సీట్లు భర్తీ అయ్యాయి. లక్ష్మణచాంద కేజీబీవీలో బైపీసీలో సీట్లు మొత్తం భర్తీ కాగా.. ఎంపీసీలో కొన్ని సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

### కేజీబీవీలను బలోపేతం చేస్తాం..

కేజీబీవీ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు స్వస్తి పలికి సర్కారు బాట పట్టడం ప్రభుత్వ పాఠశాలల బతోపేతం అవుతుండడం ఇందుకు నిదర్శంగా చెప్పవచ్చు. ఒకప్పుడు డ్రాపౌట్స్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీలు ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పోటీ పడుతూ.. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నాయి. కేజీబీవీలను మరింత బలోపేతం చేసేందుకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నాం.

\- డీఈవో రవీందర్‌రెడ్డి, నిర్మల్